# రామిగాడు

[కథానిక]

= శ్రీ అనిశెట్టి వెంకటసుబ్బారావు =

ఒకసారి తను చెప్పులమ్ముకొంటూ తిరిగే రోజుల్లో అచ్చమైన నల్లని బలమైన దున్నలను పెదకాపు కామయ్య తెచ్చి అందరిలోనూ ప్రదర్శిస్తూంటే ఆ పౌరుషానికి, సరదాకు పొంగిపోయి ఒక కిర్రుచెప్పుల జత తెచ్చి యిచ్చుకున్నాడు ప్రత్యేకంగా. అప్పటి నుంచీ కామయ్యకు వాడిమీద సదభిప్రాయం. వాణ్ణే జీతగాడిక్రింద పెట్టుకున్నాడు తన కాపురంలో.

రామిగాడు జీతానికి కుదిరినతరువాత పదేళ్లకు వాడిభార్య చనిపోయింది. అంత చిన్నతనంలోనే మనసిచ్చిన భార్య పోయినందుకు వాడేమి వికలమైనాడో, మళ్లీ తన గుడిసెకే చేరుకుని చెప్పులు కుట్టుకుంటూ ఒంటరిగా మాలపల్లెలో జీవితం సాగించవలెననుకున్నాడు. కాని కామయ్య పట్టుపట్టాడు. అదిగాక ఇన్నాళ్లనుంచీ అంత పెద్దపెంకుటింట్లో అంగలు వెయ్యడం నేర్చుకొని, పడుకునేది దున్నపోతులదగ్గరే ఐనా, ఇల్లంతా ఏకంగా స్వేచ్ఛగా తిరుగుతూన్న అలవాటు తప్పిపోలేకపోయ్యాడు. ఆ దున్నల జతవద్దనో, గడపముందు బండమీదనో పడుకుంటూ నీరు, మేత తెస్తూ, పొలం తోలుకుపొయ్యి వప్పజెపుతూండేవాడు.

కామయ్య ఒకే కొడుకు పెదనారాయణ వేసవి శెలవులకు ఇంటికి తిరిగొచ్చేవాడు, వెళ్లేవాడు; ఈ విషయాల్లో శ్రద్ధగాని జోక్యంగాని పెట్టుకోలేదు. అందువల్ల ఇంట్లోవున్న ముసలమ్మలిద్దరికీ రామిగాడి మాటలతోనే ప్రొద్దు వెళ్లబారిపోయ్యేది.

పెదకాపుగారితోపాటు వారి జీతగాళ్లకు గూడ పలుకుబడి వుంటుంది. ఆరోజుల్లో రామిగాడిదే సౌఖ్యం. మస్తుగా, పొలానికి వెళ్లినప్పుడూ, బాడుగకు పల్లెలకు వెళ్లినప్పుడూ వాడియీలలు, పాటలు వూళ్లో చెప్పుకునేవారు. దిగులెరుగడు. పెదకాపుగారికి నమ్మకబంటై తిరిగేవాడు.

“వీడికి కేసిరి ఎంత అదృష్టంచేసుకుంటే పట్టిందో” అనుకునేవారందరూను.

కొన్నాళ్లు జరిగి కామయ్య వృద్ధుడైపోయి పొలం వెళ్లలేకపొయ్యేవాడు. తరువాత బయటికే వచ్చేవాడు గాదు. తన చుట్ట ఏమిటో తనేమిటో! పెదనారాయణ మీదపడ్డ గృహభారం అంతనూ కొద్ది కొద్దిగా తగ్గించివేసుకుంటూ వచ్చాడు. పొలం అమ్మి సొమ్ముచేసుకున్నాడు. ముసలమ్మలను బంధువుల యింటికి పంపించివేశాడు. కాని, కామయ్య బ్రతికివున్నన్నాళ్లూ దున్నల జతను అమ్మనివ్వలేదు. రామిగాడికి వాటిదే ప్రాణం అని ఆయనకు తెలుసు. అప్పుడప్పుడూ కొట్టంలో ఏ గొడ్డయినా మేత కొరక్కపోతే రామిగాడు, తింటున్న జొన్నబువ్వకంచం తీసుకెళ్లి వాటిముందు పెట్టి వీపురువ్వేవాడు. పని చెయ్యడం మందగిస్తే, జబ్బుచేస్తే తను నీరే తాగేవాడుగాదు. ఇవన్నీ కళ్లతో చూస్తున్న కామయ్య అమ్మేందుకు ఒప్పుకొననేలేదు. రామిగాడిమీద ప్రేమ పెదనారాయణ గ్రహించకపోలేదు. ఐనా, ఆ దున్నల్ని మేపడం కష్టమే. రామిగాడి కప్పుడే నలభయియేళ్లయినా వచ్చివుంటాయి. అదిగాక తనకు తగిన వూళ్లోనే తాను నివసించాలని పూర్తిగా నిశ్చయించుకున్నాడు. దున్నల్ని అమ్మడం తప్పేలాగులేదు. రామిగాడు ఊళ్లోలేని సమయం చూసి చప్పున బేరం కుదుర్చుకొని పంపించేశాడు. వాడు వచ్చేప్పటికే మూటాముల్లే సిద్ధంచేసి కాపురం మార్చెయ్యడానికి తయారై వున్నాడు. ఊళ్లో అవతలపార్టీవారు తప్ప తక్కినవారంతా పెదకాపుగారు ఊరు మారుస్తున్నారంటే చూడ్డానికి వచ్చి

చుట్టూ మూగారు. రామిగాడు రాగానే పెదనారాయణ ఎన్నడూ ఎరగనివాడు చెయ్యిపట్టుకొని చెప్పాడు: "నువ్వేమేమో అనుకునేవురా ... పెద్దవాడివౌతూ జంతువుల కెంత కాలమని మేత తెస్తావు ... వాటి నమ్మేశాను. నీకే విశ్రాంతిగా వుంటుంది. ఇటుచూడు, మావాళ్లందరినీ పంపించేశానా! ఈ పెద్ద పెంకుటిల్లు నీ క్రిందే వుంటుంది..." రామిగాడు పసిపిల్లవలె కళ్లనీళ్లు పెట్టుకున్నాడంతమందిలోనూ. అందరూ తలకొక మాటచెప్పి అనునయించాలని చూశారు.

"ఎందు కమ్మారు! నేను చూచుకోక పోయ్యానా ... ఐనా ఈయిల్లు నాకెందుకు ... నేను వెళ్లి మాగుడిసెలోనే వుంటా ... అయ్యో! మన జత అమ్మేశారూ!" దుఃఖం పొర్లివస్తున్నా మాటలు పొర్లిరాలేదు. జంతువుల్ని అంత ప్రేమతో పెంచుకున్నందుకు, రోజు కొకజత మార్చే కాపులందరికీ ఆశ్చర్యమై పోయింది.

"ఒరేయ్! దాన్దేమీ మనస్సులో పెట్టుకోకు... ఈయిల్లు చూచుకుంటూవుండు. వసారా, హాలు, వంటయిల్లు, దొడ్డి ... చూడు! నీ పేరుకు మారుస్తాను ఊరికెళ్లి" అన్నాడు పెదనారాయణ. రామిగాడి మనస్సులో నిజంగా అది ఇస్తే బావుండునన్న కోర్కెవున్నా. అంత యిల్లు తనకు ఊరికే లభిస్తుందని ఊహించుకోనైనా లేని మనస్సుతో "అమ్మో! ఇంత ఇల్లే! ఐనా మీయిల్లు నాకెందుకు బాబుగారూ ... నా గుడిసే నాకు సరిపోతుం" దన్నాడు. ఆ గుడిసె కొన్నేళ్లక్రితమే పందులు త్రవ్వేసినవని తెలిసిగూడ. పెదనారాయణ సముదాయించాడు. తప్పనిసరి అన్నాడు. పొరుగువాళ్లంతా "వీడి కీసెరి ఎంత అదృష్టం వుంటే పట్టిందో" నని గుస గుస లాడుకున్నారు.

రామిగాడు ఆ యిల్లు తీసుకున్న మరునాటి నుంచీ అక్కడే వుండేవాడు. కొట్టంమీది తాటాకుల కప్పు జారి సందులేర్పడి కూలిపోయేలాగు తయారైనది. వసారాలోవున్న కుక్కిమంచంమీద గొంగళీ వేసుకొని అక్కడే పడుకొంటూ వుండేవాడు. వెలుతురు బాగా వస్తుంది. గాలి వీస్తుంది. దానికి ముందు బయటి గోడా, ద్వారమూ వున్నవి. ప్రతిరోజూ తనకు కావలసినంతమాత్రం వండుకొని, తిని ఇంటిని అతి జాగ్రత్తగా కాపాడుకునేవాడు. ఇంటి తలుపులూ, కిటికీలూ తీసి మళ్లీ మూసేసి, మళ్లీ తీసి బయటికి చూసి, మూసేసి పడుకొనేవాడు. మధ్యాహ్నం నిద్ర. సాయంత్రమూ, రాత్రీ ఎల్లాగూ నిద్రే. బయట పూర్వమిత్రు లెవ్వరైనా కన్పిస్తే, వస్తారేమో, తనతో వుంటానని తనభాగ్యాన్నాక్రమిస్తారేమో నన్న భయంతోనో, కలకన్నట్టుగా ఇంత విశాలమైన భవనం పొంది మనఃస్థితి మారిపోయిందన్న శంకతోనో తలుపులు బిగించే వుంచేవాడు. పూర్వం పసిపిల్లలతో, దున్నల జతతో నిరాఘాటంగా, తనది కాదు అనే వివక్షత లేకుండా ఆడుకొంటూ వుండేవాడు. పొలంలోనూ, వూరిలోనూ ఇప్పు డెవరితోనూ పరిచయం వుంచుకోలేదు. ప్రతిరోజూ మంచంమీద పడుకొని తనలో తానే మాట్లాడుకుంటూ అప్పుడప్పుడూ కప్పువంక, నేలవంక చూస్తూ కన్నుమూసేవాడు. ఇప్పుడు చెప్పులు కుట్టుకుందామనే సరదా, పొలం గట్లవంక వెళ్లివద్దామనే హుషారూ లేవు. మొదట కొన్నాళ్లవరకూ ఎవరెవరో వచ్చి తలుపు తడుతూ 'అరేయ్' 'ఒరేయ్' అని కేకలు వేస్తూ వెళ్లేవారు. ఇప్పు డెవరూ రావడంలేదు. బైట తలుపులమీద పిల్లలు బొగ్గులతోనూ, సున్నంతోనూ ఏవో రాసే శబ్దాలు విన్పించేవి. ఎవరైనా కన్పిస్తారేమోనని బైటికివెళ్లి తలుపేతియ్యడంలేదు. కొన్నాళ్ల వరకూ ఇంటిముందు వీథిలాంతరు వెల్గించే తల కన్పించేది, గోడమీదినుంచి. ఇప్పు డదీలేదు.

రామిగాడికి పూర్వంవలె ఉత్సాహం విజృంభించడమే లేదు. ప్రశాంతంగా ఇంట్లోనే తిరుగవచ్చు. పనిచెయ్యవలసిన అవసరం లేదు. అసలిప్పుడు నాగలి యెత్తడం, మేడి పట్టుకోవడంలాంటి బరువైన పనులు చెయ్యలేడుగూడ. అదిగాక, పిల్లలందరూ వచ్చి 'గోల గోల' చేస్తూంటే తనకు నిద్రపట్టడంలేదు సుఖంగా. అందుకని కుక్కిమంచం హాల్లోనికి తీసుకెళ్లి వేసుకున్నాడు. ఎప్పటివలె ప్రొద్దున్నే కిటికీలు తెరిచి, లోపలి తలుపులు తెరిచి, బయటికి చూసి మళ్లీ మూసేసేవాడు. ఆమంచంమీద పడుకున్నా బయటిదృశ్యం స్పష్టంగా ఊచల్లోగుండా కన్పించే కిటికీ ఒకటి మాత్రం తెరిచివుంచేవాడు. పైకి చూస్తే పెంకులు నలుపుకు

తిరుగుతున్నవి. గడపలకు వేసిన కుంకుమబొట్లు చెరిగిపోయి ఇంటిమూలలన్నీ బూజుపట్టినవి. వాటిని వీలైనంతవరకూ తుడిచాడు, శుభ్రం చేశాడు. వర్షం కురిసినప్పుడు నీటిబొట్లు పడుతున్నాయని గవాక్షం మూసేసి వెలుతురు రాకుండా చేశాడు. పనిచేసే అలవాటు పూర్తిగా తప్పిపోవడంవల్ల ఇప్పుడెందుకు పూనుకున్నా అసంభవమేమో నన్పిస్తున్నది, భయం వేస్తున్నది.

ప్రతిరోజూ అలాగే ఓపికచేసుకొని, లేచి మొహంకడుక్కొని, నీళ్లు పట్టుకొచ్చి ధాన్యపుపాత్ర మీది బండ ఎత్తి జొన్నలుతీసి వంట చేసుకొని, తిని పడుకునేవాడు. కిటికీనుంచి బైట పొలంపని చేస్తూ నవ్వుతూ అటూ ఇటూ తిరుగుతూన్న కాపుల్నీ, నూరిపిల్ల పాటలు పాడుతూ 'హై హై' అని అరుస్తూ, 'హో హో' అని కూతవేటుదూరం లోని వ్యక్తుల్ని పరామర్శించేవాళ్లను చూస్తూ పడుకునేవాడు. పచ్చని మొక్కల మీద ఎర్రగా క్రోధం నిండిన కనిగ్రుడ్లవలె ఊగే జొన్న చూస్తూ పూర్వస్మృతులు తెచ్చుకొని కంపించేవాడు. నీలంగా దూరంగా కన్పిస్తున్న ఆకాశాన్ని ఆశ్చర్యంగా చూసేవాడు. చూస్తూచూస్తూనే అతని కళ్లకొసలలో రెండు కన్నీటి బిందువులు జారేవి. మళ్లీ ఇంటివంక చూచుకునేవాడు. మూసినగవాక్షంవంక, పెద్దకిటికీలవంక, తియ్యకతియ్యక తీస్తే 'ఝుంయి' మనే తలుపులవంక చూసేవాడు. నిద్రపొయ్యేవాడు.

రామిగాడు ఇల్లుఊడ్చుకోవడం మానేసి వారం రోజులైనది. మూలలన్నీ మళ్లీబూజుపట్టి ప్రత్తిబుట్టలై పోయినవి. ఎప్పుడో చొరవచేసుకున్న గబ్బిలం తెరిచిన ఒక కిటికీవద్దకూ అనేకమార్లు వస్తుంది. బైటకు వెళ్లాలని తపతప వచ్చి ఇనుప ఊచలకు కొట్టుకొని వెనక్కు పడిపోతుంది. రామిగాడు మంచంమీద పడుకునే వున్నాడు. జబ్బు ఏమీ గోచరించకపోయినా మనిషిలో మెరుగు తగ్గి పోయింది పూర్తిగా. లేవవలెననే బుద్ధే లేదు. ప్రొద్దున్నే వంట చేసుకునేందుకు లేవగలనని కూడ అనిపించలేదు. రెండు మూడుసార్లు నులకమీద చేతులు నొక్కి లేచి మళ్లీ పడుకున్నాడు. ఎవరో ఎద్దుల్నదిలించుకొంటూ వెడుతూంటే చేయెత్తి పిలిచాడు, 'ఏమయ్యోయ్ ...' అని. గొంతులోనుంచి విడివడ్డ స్వరం కిటికీ దాటిపోయివుండదు. కొన్ని రోజులుగా అతను మాట్లాడినమాట అదే. ఐనా ఏదోవిధంగా లేస్తే బావుండును. శ్రమించి కాళ్లు ముడుచుకొని గొంగళీ వొంటిమీదినుంచి తొలగించాడు. చేతుల మీద ప్రయత్నించి చివరకు లేచాడు. నల్లని నిగనిగ లాడే పూర్వపు ఒంటిమీద కాంతి పూర్తిగా తగ్గి, మసిరంగుగా, ముడతలు పడిపోతే తన్ను తానే శంకించుకొని రెండు హస్తాలతోనూ ఒళ్లు నిమురుకున్నాడు. వంటింట్లోనే పడుకుంటే ప్రతి రోజూ లేవకుండా వంట చేసుకోవచ్చు. ఎండపడి వొళ్లు వేడెక్కదు, వెన్నెల నిద్రకు అడ్డంరాదు. పెద కాపుగారు వంటచేసుకున్న పవిత్రస్థల మది. రామి గాడు మెల్లగా మంచం పట్టుకొని, జరుపుకొంటూ వంటింట్లో పొయ్యిప్రక్కను ధాన్యపుపాత్రపై బండ మీదికి లాక్కున్నాడు. ఆయాసం తగ్గేందుకు కొంచెం సేపు పడుకున్నాడు. అతని వెనకనే దొడ్డివాకిలి బిగించి వుంది. ఇప్పుడు దూరంగా పొలంలోవున్న ఆ కిటికీవంక చూస్తూ కొంచెం లేచాడు చేతులమీద. శుభ్రం చెయ్యక మురికిగావున్న అతని కళ్లల్లోంచి నీరు ఏకంగా తెల్లగడ్డివలె తిరిగిన గడ్డంలోనికి జారి పోతున్నది.

లేనిశక్తితో ఒక్కుమ్మడి లేచాడు — "నేను మాత్రం పనిచేసుకోలేనూ!" అన్నాడు. ఆ మాటలు గూడ కిటికీ దాటిపోయివుండవు. లేచినవాడు పొయ్యి మీద కూలిపడి పెంకుటింటి కప్పువంక చూస్తూనే వున్నాడు.

ఇరుగుపొరుగువాళ్లందరూ చేరి తలకొకమాట అనుకున్నారు. "వీడి కీసిరి ఎంత అదృష్టం చేసుకుంటే పడుతుంది!" అన్నారు.